క్లుప్తంగా

డీఆర్వోను కలిసిన గ్రామ రెవెన్యూ సంఘం నాయకులు



డీఆర్వో వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా రెవెన్యూ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓకు రావల్సిన బకాయిలు, పాత పెండింగ్ బిల్లులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మల్ల జకరయ్య, జిల్లా జాయింట్ సెక్రెటరీ కెనడి, నర్సాపురం డివిజన్ అధ్యక్షుడు సత్తిబాబు, భీమవరం మండలఅధ్యక్షుడు ఆర్ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఆకివీడు: యూటీఎఫ్ నూతన మండల కమిటీ కార్యవర్గం మంగళవారం ఏర్పడింది. కమిటీ అధ్యక్షుడిగా జెడ్‌పీ సత్యనారాయణ, సహాధ్యక్షుడిగా ముత్యాల వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆర్వీఎస్ నారాయణ(విక్రమ్), కోశాధికారిగా జిల్లా వెంకటేశ్వరరావుతో పాటు కార్యవర్గం ఏర్పడింది. నూతన కమిటీ ఎన్నికల అధికారిగా జి.రామకృష్ణ వ్యవహరించారు.

వరద బాధితులకు విరాళం

ఆకివీడు: స్థానిక విద్యావికాస్ ప్రైవేట్ జూనియర్ కాలేజీ విద్యార్థులు వరద బాధితులకు అండగా నిలిచారు. విద్యార్థులంతా కలిసి సేకరించిన విరాళం రూ. 1,01,217ల చెక్కును ప్రిన్సిపాల్ చొప్పర్ల బలరామ్ స్థానిక ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కళాశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు.

భక్తాంజనేయ ఆలయంలో భక్తుల రద్దీ

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ దంపతులు స్వామి వారికి అభిషేకము చేయడానికి రూ.15000 విలువైన ప్రత్యేక ఇత్తడితో చేసిన పూజాపాత్రను ఆలయం కమిటీకి అందజేసారు. అదేవిధంగా ఆలయంలో సేవచేస్తున్న 20 మంది స్త్రీలకు కాషాయ రంగు చీరలను సర్పంచ్‌దంపతుల చేతుల మీదుగా అందించారు. అనంతరం సర్పంచ్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

భీమవరం: ప్లాస్టిక్ ఆరోగ్యానికి హానికరమని, ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ సామాజిక బాధ్యతగా నిలిపివేయాలని భీమవరం మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె వెంకటేశ్వరావు అన్నారు. భీమవరం ఝాన్సీలక్ష్మీబాయి(జెఎల్‌బీ) మునిసిపల్ హైస్కూల్లో మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అరికట్టకపోతే భవిష్యత్ నాశనమేనని, ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. అందువల్లనే ప్రభుత్వం పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం పిబి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ద్వారా అంతుపట్టని శాశ్వత రోగాలు వస్తాయని, అంత హానికరమైన ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, తేజ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమా సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్) : కార్తీక మాసం మంగళవారం భీమవరం పంచారామ క్షేత్రంలో ఉమా సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోంబాబు రామకృష్ణ స్వామివారికి మంగళవారం తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అలాగే మంగళవారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి రామకృష్ణంరాజు ఆలయ అధికారులు అర్చకులు పాల్గొన్నారు.

4వ రోజు రూ. 33,306 ఆదాయం

భీమవరం గునుపూడిలో శ్రీ సోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానం నందు కార్తీక మాసోత్సవములు 4వ రోజు సందర్భంగా ఆలయానికి రూ. 33,306లు ఆదాయం వచ్చినట్లు ఈవో రామకృష్ణంరాజు తెలిపారు.

ప్రజారోగ్యానికి మంగళం

- మొక్కుబడిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్
- అటకెక్కిన జ్వరాల సర్వే

ఉండి: నియోజకవర్గంలో ప్రజారోగ్యానికి మంగళం పాడేస్తున్నారు. ఒకవైపు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తుండగా ఇటీవ చేయాల్సిన జ్వరాల సర్వే అటకెక్కింది. దీంతో గ్రామీణ ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అనే వినూత్న కార్యక్రమానికి నాంది పలికిన నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యులను, సిబ్బందిని ఇంటింటికీ పంపించి ప్రజారోగ్య పరిరక్షణకు నడుంబిగించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అటకెక్కించింది. కార్యక్రమాన్ని కొనసాగిస్తే జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందనే భయంతోనే ఈ కార్యక్రమానికి మంగళం పాడారని ప్రజలు విమర్శిస్తున్నారు. మంచంపైనే వుండి వైద్య చికిత్స పొందే రోగులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరంలా ఉండేది. నేరుగా ప్రభుత్వ వైద్యుడు ఇంటికి వచ్చి రోగిని పరీక్షించి రోగి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ఇంటివారికి సమాచారం అందించేవారు. అలాగే స్థానికంగా వుండే వైద్య సిబ్బందికి సూచనలిచ్చి చికిత్స అందించేవారు. దీంతో రోగి ఆరోగ్యం ఎప్పటికప్పుడు మెరుగై పూర్తి ఆరోగ్యంగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఎవరేమైనా కానీ మా ఆలోచన మాదే అన్నట్టు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఎంతో అత్యతవసరమైన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పునరుద్ధరించి తీరాల్సిందేనంటూ ప్రజలు కోరుతున్నారు.



ఉండిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం (ఫైల్)



ఎన్నార్పీ అగ్రహారంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

అటకెక్కిన ఫీవర్ సర్వే

మరో అత్యంత ఆవశ్యకమైన కార్యక్రమం గ్రామాల్లో ఫీవర్‌సర్వే కార్యక్రమం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఫీవర్ సర్వేకు మంగళం పాడేశారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజారోగ్యం ఎంలా ఉందో పరీక్షించే విధానం అటకెక్కింది. ప్రస్తుతం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోను జ్వరాల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. గతంలో వచ్చే జ్వరాలతో పోల్చుకుంటే ఇప్పుడు వస్తున్న జ్వరాలు చాలా భయంకరంగా ఉన్నాయి. జ్వరంతో పాటుగా విపరీతమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు, శరీరం రంగు మారిపోవడం, ముఖంపై మచ్చలు రావడం వంటివి జ్వరం వచ్చినప్పుడు రోగులకు సంభవిస్తున్నాయి. ఇంత భయంకరమైన పరిస్థితులు తలెత్తితే దగ్గరుండి చూడాల్సిన ప్రభుత్వం గత ప్రభుత్వానికి పేరు రాకూడదని ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారంటూ ప్రజలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు.

ఇది దారుణం



ప్రజలు ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ గత ప్రభుత్వం చేసింది కాబట్టి మేం చేయము అన్నట్టు వ్యవహరించడం దారుణం. ప్రజల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందంటే గత ప్రభుత్వం కంటే మెరుగ్గా వైద్య కార్యక్రమాలు నిర్వహించాల్సింది పోయి ఉన్న వాటిని అటకెక్కించడం దారుణం.

– గౌతే హరీష్, పాండువ్వ

ప్రజల ప్రాణాలు కాపాడండి



ఒకవైపు జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతుంటే ప్రభుత్వ వైద్య సేవలు ఏమాత్రం ఆదుకోవడం లేదు.గత ప్రభుత్వంలో ఎవరికి ఇబ్బంది కలుగకుండా ఇంటి వద్దకే వైద్యసేవలు వచ్చేవి. కానీ ఇప్పుడు అవన్నీ మాయమైపోయాయి. రాజకీయాలకంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం కాబట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

– వెలగపల్లి టోనీ, యండగండి

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వం చూసుకోవాలి. డబ్బున్నవాళ్లు కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగెడతారు. కానీ నిరుపేదల సంగతి ఏంటి? ప్రభుత్వం అందించే వైద్య సేవలపై ఆధారపడి జీవిస్తారు.కానీ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం మంచి కార్యక్రమాలను రద్దు చేయకుండా కొనసాగించాలి.

– బదుగు బాలాజీ,ఉండి.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం



గొర్రుముచ్చు సుందర్‌కుమార్

ఉండి: చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారందరిపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తుందని ఇది ముమ్మాటికీ వ్యక్తి స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రుముచ్చు సుందర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులతో బనాయించడంపై పార్టీ ఆదేశాల మేరకు వారికి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయిస్తే వారికి తప్పకుండా ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయిస్తే జిల్లా లీగల్ సెల్‌కు 83670 91142 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

అభివృద్ధి అంటే పేదల ఇళ్లు కూల్చడమా?



అయిభీమవరం రోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, బాధిత కుటుంబాలు.

ఆకివీడు: పేదల ఇళ్లు కూల్చడం అభివృద్ధిచేయడం కాదని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జేఎన్వీ.గోపాలన్ ఆరోపించారు. అయిభీమవరం రోడ్డులో ఆక్రమణల్లో ఉన్న పేదల ఇళ్ళను ఖాళీ చేయించడంపై మంగళవారం సీపీఎం, బాధిత కుటుంబాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డు సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉండి నియోజకవర్గంలో పేదల గుడిసెలను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు ప్రక్కన పేదల గుడిసెలు ఉండకూడదని, అందమైన భవనాలు, పార్కులు ఉంటేనే అభివృద్ధా? అని ఆయన ప్రశ్నించారు. కాలనీల్లో పేదలకు మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. అధికారులను తప్పుదోవ పట్టించి పేదల ఇళ్లపై దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. పేదల ఇళ్లకు అన్యాయంగా విద్యుత్ కనెక్షన్లు కట్ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు డి.కళ్యాణి, సభ్యుడు గొర్ల రామకృష్ణ, డోకల లక్ష్మి, సందక ఉదయ కుమారి, డోకల రవితేజ, బీవీ.వర్మ, రాంబాబు, సూరిబాబు, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

12న సర్వమత ప్రార్థనలు

భీమవరం: సర్వోదయ నాయకుడు, విద్యాదాత చింతపాటి వరప్రసాదమూర్తిరాజు వర్ధంతి సందర్భంగా ఈనెల 12వ తేదిన మూర్తిరాజు నెలకొల్పిన 68 విద్యాసంస్థల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సర్వమత ప్రార్థనలు, అక్షరాస్యత ర్యాలీలు, పెదనిండ్రకొలను గ్రామంలోని మహాత్మాగాంధీ భవనం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, సర్వోదయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రసాదరాజు కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు



పాలకోడేరు లో పుట్టను దర్శించుకున్న భక్తులు



కాళ్ళ: కాళ్లకూరులో పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు



భీమవరంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాలలో భక్తులు మంగళవారం నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల, కోలనపల్లి, బొండాడ, జక్కరం, కాళ్ళకూరు, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కోపల్లె, పెదఅమీరం, సీసలి తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సమేతంగా సమీపంలోని పుట్ట వద్దకు చేరుకున్నారు. పుట్టలో పాలు వేసి, పిండి పదార్థాలను పుట్ట వద్ద ఉంచి పూజలను నిర్వహించారు. అనంతరం నువ్వుల పిండి, బియ్యం పిండి తదితర ప్రసాదాన్ని పంచి పెట్టారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఉదయం నుండి గ్రామ సమీపంలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోశారు. ముఖ్యంగా మహిళా భక్తులు పుట్టల వద్ద నైవేద్యాలు సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు. పిల్లలైతే కేరింతలు కొడుతూ దీపావళి మందు సామగ్రిని ఆయా ప్రాంతాల వద్ద కాల్చి సందడి చేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: కార్తీక మాసం, నాగుల చవితి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు పాముల పుట్టల వద్దకు వెళ్లి పుట్టలో ఆవుపాలు పోసి, పూజలు చేశారు. ముఖ్యంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాలా మంది భక్తులు సుబ్రహ్మణ్యుని ఆలయంలో పాలు పోశారు.

ఉండిలో..

ఉండి: మండలవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఉదయం నుంచి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సన్నిధిరాజు చలపతిరావు, ఫణిశర్మ, కిరణ్‌శర్మ,ముట్నూరి సాయి తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నాగులచవితి నేపథ్యంలో ఊర్లన్నీ సందడిగా మారాయి.

ఘనంగా నాగులచవితి వేడుకలు

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలో మంగళవారం నాగుల చవితి పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివారు ప్రాంతాల్లో పట్టణంలోని ఆలయాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, నాగదేవతకు పాలు, గుడ్లు, పండ్లు సమర్పించారు. అలాగే సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఊరూవాడా సందడి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, చినఅమిరం, రాయలం, అనాకోడేరు, కొమరాడ, తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప, గొల్లవానితిప్ప, దొంగపిండి, నాగిడిపాలెం, గూట్లపాడు, దెయ్యాలతిప్ప, లోసరి తదితర గ్రామాలలో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే భక్తులు వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయాలకు, నాగు పాము పుట్టల వద్దకు చేరుకుని ఆవు పాలు, కోడి గుడ్లు, అరటిపళ్లు, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయిభీమవరంలో హెల్త్ క్యాంప్

సాక్షి స్పందన

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామంలో జ్వరాల తీవ్రత తగ్గించేందుకు గ్రామంలో హెల్త్ క్యాంపులు కొనసాగిస్తున్నారు. అయిభీమవరంలో జ్వరాలు అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు హెల్త్ క్యాంపులను నిర్వహించి, ప్రతీరోజూ నివేదికలు సేకరిస్తున్నారు. గత రెండు రోజులుగా దళిత పేటలో క్యాంపు నిర్వహించగా, మంగళవారం తూర్పు కాపులపేటలో క్యాంప్ ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. క్యాంపుకు 62 మంది రోగులు వచ్చి వైద్యం పొందారు. హెల్త్ అసిస్టెంట్‌లు మూడు బృందాలుగా ఏర్పడి ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. సర్వేలో ఒక వ్యక్తి జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



అయిభీమవరంలోని తూర్పుకాపుల పేటలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్

ఆభరణాల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

భీమవరం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్.జి. జయసూర్య మంగళవారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 20వ తేదిన భీమవరం పట్టణానికి చెందిన కె.నాగ ఉమామహేశ్వరి వీరవాసరం మండలం బలుసుగొయ్యి పాలెం నుంచి భీమవరం వస్తుండగా బట్టల బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దొంగిలించినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయగా ఈ కేసులో నిందితులైన ఆకివీడుకు చెందిన గుద్దాటి వల్లియ్య, నరమామిడి పోశమ్మ, ఆవుల రవళి, బండి నర్సింహులు, నరమామిడి హరిబాబు వస్తువులను దొంగిలించారు. దీంతో దర్యాప్తు చేపట్టిన భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం. నాగరాజు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ జయసూర్య తెలిపారు. ఈ కేసులో నిందితుల నుంచి 7 కాసుల బంగారు హారం, 4 కాసుల నక్లెస్, 5 కాసుల రెండు గాజులు, 3 కాసుల 4 ఉంగరాలు, చెవిదిద్దులు, చెంప సవరాలు, పాపిడ బొట్టు, మ్యాటీలు, ముక్కుపుడకతో సహా 28 కాసులు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ నాగరాజు, ఎస్ఐ వై.బి. కిరణ్‌కుమార్, ఏఎస్సై ఈతకోట శ్రీను, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, రామకృష్ణలను ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.



ఆభరణాల చోరీ కేసులో నిందితుల వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

పుస్తక పఠనంతో మేధస్సుకు పదును

భీమవరం(ప్రకాశంచౌక్): పుస్తక పఠనంతోనే మేధస్సుకు పదును అని, గ్రంథాలయాల్లో బ్యాంకింగ్‌కు సంబంధించిన పుస్తకాలు అరుదుగా లభిస్తాయని, ఈ నేపథ్యంలో ఎంబీఏ విద్యార్థుల కోసం కృష్ణమూర్తి రచించిన ఇండియా :100 పుస్తకాలు గ్రంథాలయాల్లో లభించడం గొప్ప విశేషమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి తెలిపారు. చెన్నైకి చెందిన కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యన్ రచించిన ఇండియా :100 పుస్తకాలను పట్టణంలోని గ్రంథాలయాలకు విజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో అందించే కార్యక్రమాన్ని భీమవరం యూనియన్ బ్యాంక్‌లో ప్రారంభించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఇండియా :100 పుస్తకాలు ఎంబీఏ విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయని, అన్ని కళాశాలలోని ఎంబీఏ విద్యార్థులు ఈ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలోని డీఎన్నార్, కేజీఆర్‌ఎల్, సీఎస్ఎన్, శ్రీఆదిత్య, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు ఈ పుస్తకాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు కె.శిరీష, అడవి సత్యనారయణ, కాకుమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జీవనశైలి మార్చుకోవాలి

ఉండి: సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి వ్యక్తీ తన జీవనశైలిని మార్చుకుంటేనే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉంటామని ఉండి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉండి జెడ్పీ హైస్కూల్‌లో పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం వై.రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సాయిచంద్ర మాట్లాడుతూ పిల్లల్లో లుకేమియా, మెదడు, వెన్నపాము, కణితులు, లింపోమా తదితర క్యాన్సర్లు వ యన్నారు.ప్లాస్టిక్ వినియోగం జంక్‌ఫుడ్స్ తినడం మానుకోవాలన్నారు. గొట్టుముక్కల రాము సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి,కార్యదర్శి ముదునూరి శివరామరాజు,ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు,బుద్ధరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎస్సీ శ్మశాన వాటిక చుట్టూ ప్రహారీ నిర్మించండి



ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా ప్రహారీ నిర్మించి అభివృద్ధి చేయాలని ఎస్సీ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ సభ్యులు ఇంజేటి ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, గోగులమండ అశోక్ అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే అంజిబాబుకు శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 4 ఎస్సీ పేటలు బ్రిటీష్ కాలం నుంచి శ్మశాన వాటికను వినియోగించుకుంటున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదల వల్ల పాత సమాధుల్లోనే ఖననం చేయాల్సి వస్తుందన్నారు. శ్మశాన వాటిక విస్తీర్ణం సరిపోవడం లేదని చెప్పారు. ఉన్న శ్మశానాన్ని ఆక్రమించుకునేందుకు గతంలో రోడ్డు వేస్తే ఎస్సీలమంతా వెళ్లి పోరాటం చేసి అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో కొంతమంది అక్రమార్కులు రోడ్డు వేస్తుంటే మళ్లీ అడ్డుకున్నామని దీంతో ఆర్డీవో, తహసీల్దార్‌ల సమక్షంలో సరిహద్దులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ప్రహారీ నిర్మించి పరిరక్షించాలని ఎమ్మెల్యే అంజిబాబు దృష్టికి తీసుకువెళ్లారు.

మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం మండలంలోని వెంప గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు రూ. 37.95లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం రూ.72 లక్షల నిధులతో 3,800 మీటర్ల పైపులైన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంపీడీవో గంగాధర్, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, ఎంపీటీసీ చిలకపాటి కుమారి, ఉప సర్పంచ్ కలిదిండి చినబంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

ఉండి: ఉండి మండలం అర్తమూరులో మంగళవారం పని చేస్తూనే పామర్తి వీరాస్వామి(80) అనే ఉపాధి కూలీ మృతి చెందాడు. పని చేస్తున్న స్థలంలోనే కుప్పకూలిపోవడంతో అతనిని వెంటనే ఇంటికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధుని మృతి సమాచారం అందుకున్న మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగారాజు ఘటనాస్థలికి వెళ్లి సమాచారం సేకరించారు.